# బ్రతుకు తెరువు!

రచన :
శ్రీ జి. జగన్నాధ రావు (శ్రీ పద్మ)

(గతసంచిక తరువాయి)

నేనూ మరోయిద్దరు మధ్యవయస్కులైన వ్యక్తులు తప్ప ఇంకెవ్వరూ లేరు. అందులో ఒకాయన నల్లగా పొట్టిగా వున్నాడు. ఎందుకో నావేపే చూస్తున్నాడు పదేపదే.

కంపార్టుమెంటులోకి ప్రవేశించిన చల్లగాలికి నా రెండు నయనాలు బరువుగా మూతలు పడినవి. మిత్రుడు నన్ను రిసీవ్ చేసుకోవటానికి స్టేషన్‌కి వచ్చేవుంటాడు. ఎన్నాళ్ళయ్యింది వాడిని చూచి? మిత్రుడిని చూడ బోతున్నాననీ ఆనందం అవధులు దాటిపోయింది. అట్లా ఆలోచిస్తూనే ప్రగాఢ నిద్రలోకి జారిపోయానేమో?

తెలివివచ్చి చూసేసరికి బండి వాల్టేర్‌లో ఆగివుంది. మనుకు హార విడిపోయింది పూర్తిగా. కళ్ళను నులుపు కొని చూసాను. నాతోపాటు ప్రయాణంచేసిన ఆ వ్యక్తులు దిగిపోయారప్పుడే. గబగబా లేచి నించున్నాను. "మహారాణీ పేట పోవటానికి సిటీ ఎక్కాలి, అయినా వాడెట్లాగూ వస్తాడుగా. టాక్సీ తెచ్చే వుంటాడు" అనుకున్న నేను వెనుతిరిగి చూసాను. బ్రీఫ్ కేసు——నా బ్రీఫ్ కేసు వుండవలసిన చోటలేదు. అసలు కంపార్టుమెంటంతా వెతికిన లేదు. కొట్టేసారు! నా బ్రీఫ్ కేసు ఎవ్వరో కొట్టేసారు. ఒక్క వుదుటున క్రిందకు దిగాను. దిగినాననేకంటే వురికాననంటేనే మంచిది. చుట్టూ చూసాను ప్లాటుఫారంమీద నిలబడి. నాతో ప్రాటు ప్రయాణం చేసిన ఆ యిద్దరు వ్యక్తులూ ఎక్కడా కనిపించలేదు. వాళ్ళే పట్టుకుపోయి వుంటారు నా బ్రీఫ్ కేసు.

నన్ను రిసీవ్ చేసుకోవటానికి వస్తాడనుకున్న మిత్రుడి జాడ ఎక్కడా లేదు. గత్యంతరం లేక స్టేషన్ నుంచి బయటపడ్డాను పాలిపోయిన మొహంతో.

అప్పుడే అక్కడనుంచి సిటీ, బయలుదేరుతోంది. జనం కిక్కిరిసివున్నారు. చెట్టుకు పట్టిన చీమల్లా బస్సుకు అంటుకుపోయివున్నారు జనం. ఇక వేరే మార్గం లేక డోర్ పట్టుకుని వ్రేళ్ళాడపడ్డాను నేను.

మిత్రుడేం యింతపని చేసాడు? బహుశా వుత్తరం అంది వుండకపోవచ్చు! రకరకాల ఆలోచనలతో నా బుర్ర వేడెక్కిపోతూంది. రెండు వందలూ, రెండు జతల టెరికాటన్ బట్టలతో వున్న నా బ్రీఫ్ కేసు చేజిక్కించుకున్నాడెవడో! నేనెంత దురదృష్ట వంతుణ్ణి? ఆలోచిస్తోండగానే బస్సు మహారాణిపేట వచ్చి ఆగింది.

దిగి నడక సాగించాను, బ్రీఫ్ కేసు పోయిన దగ్గర నుంచీ నా మైండు ఏమీ పనిచేయటం లేదు. నిరాశ లాంటి దేదో నన్ను బాధిస్తోంది.

ఎట్లాగో ఇల్లు చేరి, చూసి నిర్ఘాంతపోయాను, ఇంటికి తాళం వేసివుంది. ఒకవేళ ఎక్కడికేనా వెళ్ళాడేమోనని అక్కడే జేరబడిపోయాను నిర్జీవంగా, మూడు గంటల కాలం నాకు తెలియకుండానే వృధాగా గడచిపోయింది. ఇట్లా ఎంత సేపు కూర్చున్నా నిష్ప్రయోజనంలాగే వుందని గ్రహించిన నేను ఇల్లు కాళీ మార్చేసారేమోనని, ఆ పక్కింటివాళ్ళను అడిగాను.

"వాళ్ళ మామయ్యకు సీరియస్సుగా వుందని టెలిగ్రాం వస్తే వెళ్ళారు బాబు!". అది విని బిగ్గరగా ఏడవాలనిపించింది నాకు, కాని ఎట్లాగో నిగ్రహించుకున్నాను, ఏమిటి నాకీ పరీక్ష! ఎందుకు నాకీ వింత పరిస్థితి? ఏం పాపం చేసానని? నిలువునా కంపించి పోయాను, ఇప్పుడు నేనేం చేయాలి? ఎవరితోనైన నా పరిస్థితినిగూర్చి చెబితే——? ఊహూ! అందుకు అబిమానం అడ్డువచ్చింది, ఇక్కడకు రాకపోయిన బావుండేదేమో? మనం ఎన్నినుకున్నా రాసి పెట్టిన రాతను యెవరు తప్పించుకోగలరు? నా మైండు మొద్దుబారిపోతూంది, ఈగల్లా ముసురుతున్నాయి ఆలోచనలు.

మాతోపాటు చదివిన స్నేహితుడొకడు వుండాలి ఓసారి వాళ్ళవూరు తీసుకెళ్ళాడు కూడా! ఇక ఆలోచించి ప్రయోజనం లేదనుకుని ఈ వూరు వచ్చాను.

తీరా వెళ్ళిచూస్తే వాళ్ళువూరు విడిచి సంవత్సరం పైచిలుకు కావస్తోందిట! నాకు వచ్చినపాట్లు గురించి నాకే సిగ్గుగా వుంది, లోలోపలే మధన పడిపో

సాగాను, డబ్బులేకపోతే మనిషి యెందుకూ కొరగాడన్న సత్యం నాకు చిన్నప్పటినుంచీ బాగా తెలుసు, ఇప్పుడెట్లాగమ్యం చేరటం? యేమిటో నాకంతా అగమ్యగోచరంగా వుంది, నా పరిస్థితినిగూర్చి యెవరితో చెప్పుకోగలను? ఇక్కడ నాకు తెలిసినవాళ్ళెవ్వరూ లేరా? ఒకవేళ యెవ్వరితోనైన నా పరిస్థితి చెబితే "కోటి విద్యల్లో యిదో క్రొత్త కూటి విద్య" అంటారని నా భయం! ఇంతలో ఒక చక్కని అయిడియ నా మస్తిష్కంలో మెరిసిపోయింది, అంతకంటే వేరే గత్యంతరం లేక, యెంత అభిమానం అడ్డువచ్చినా అట్లాగే చెయ్యాలనుకుని మీ కాలేజికి వచ్చాను, నా పరిస్థితంతా మీముందు వెళ్ళడి చేసుకున్నానింతవరకూ..." అంటూ తన గధ ముగించి నిట్టూర్చాడు ప్రకాశం.

ఆదిశాంతం విన్న ప్రిన్సిపాల్ గారికి, తోటి వుపాధ్యాయులకూ విద్యార్ధ(నీ)లకూ ప్రకాశంమీద అపారమయిన నమ్మకం కలిగింది. ప్రకాశం నిజంగా సినిమా ఆక్టరేనని నమ్మారందరూ. అట్లా అందరకూ నమ్మకం కలగటమే తరువాయి, అందరూ చందాలు వేసుకుని ఓచిన్న మొత్తం ప్రకాశం చేతిలో పెట్టారు.

"నాకు పట్టిన ఈ దుర్గతికి మీరు చందాలు వేసుకుని, నాకు దోహదం చేయకపోతే నేనేమయిపోయేవాణ్ణి..." అంటూ కృతజ్ఞతాభావం వ్యక్తపరుస్తూ, అందరకూ చేతులెత్తి నమస్కరించాడు ప్రకాశం.

"మీరు తారాపథంలో పై మెట్టెక్కిపోతే మాలాంటివాళ్ళం జ్ఞాపకం వుంటామా?" అన్నాడు అల్లరి విద్యార్ధి.

"నా నిస్సహాయతకు మీరు చేసిన సహాయం, అంత త్వరగా మరచిపోగలనా? నా మదిలో ఎప్పుడూ మీ రూపాలనే నింపుకుని పూజించుతుంటాను..." అన్నాడు ప్రకాశం.

"ఆపదలోవున్న వాళ్ళని ఆదుకోవటంలో పెద్ద ఘనకార్యం ఏమీ లేదు బాబు! అందునా మా గాలేజీ విద్యార్థులంటే వీమిటనుకున్నావ్!" అంటూ ఆప్యాయంగా ప్రకాశం భుజంమీద చేయివేసారు తెలుగు లెక్చరర్ శాస్త్రిగారు. అందరకూ మరోసారి తన కృతజ్ఞత తెలుపుకున్నాడు ప్రకాశం.

అందానికి, మన్నికకు
రోజా
Reg No 221621
బనియన్లనే వాడండి

"మీరెంత సహృదయులుసార్! నామార్గాన నన్ను వదిలేయక, ఈరాత్రి వుండటానికి ఆశ్రయ మిచ్చారు" పొగుడుతున్నట్లుగా అన్నాడు ప్రకాశం. అది విన్న శాస్త్రిగారు వుబ్బితబ్బిబ్బయిపోయారు.

"కష్టంలో వున్నవాళ్ళని ఆదుకోకపోతే అది మానవత్వం అనిపించుకోదు బాబు! అందునా నాది జాలిగుండె. ఎవరయిన కష్టాల్లో వుంటే, ఏదో విధంగా నా శక్తి మేరకు ఆదుకోకపోతే నా తలకొట్టేసినట్లే వుంటుంది" అన్నారు శాస్త్రిగారు.

"మీ యిల్లు చాలా బాగుంది సార్!"

"బాగుండదుటోయ్! మా పెద్దల చిహ్నార్థం యిది ఒక్కటే మిగిలింది మాకు! అది సరేకాని, సినిమా విశేషాలు ఏమయినా చెప్పవోయ్ వింటాను"

"ఏముంది సార్ మామూలే! వచ్చేవారంలో కళా ప్రొడక్షన్సువారి చిత్రం షూటింగ్ వుంది. అందులో నా దొక వెరైటీ పాత్ర, బహుశా అది సక్సెసు కావచ్చునేమో? ఆ పిక్చరు చూసి మీ అభిప్రాయం తప్పక తెలుపుతారని ఆశిస్తాను, అక్కడకు సర్రైన వెంటనే నా అడ్రసుతో మీకు లెటర్ రాస్తాను."

"అట్లాగే తప్పకుండా! మావాడొకాడు అక్కడ అసిస్టెంట్ డైరెక్టరుగా పని చేస్తున్నాడు, బహుశా నీకు తెలిసే వుంటుందేమో? వాడి పేరు ఆనందరావు."




"ఓ! ఆనందరావుగారా! అయన్ను తెలియక పోవటమేమిటి? నాకు దూరపు బంధువులట! నా కృషిలో ఆయన ప్రోద్బలంకూడా కొంత వుంది, నేను వప్పుకున్న నాలుగు చిత్రాల్లో ఒక చిత్రానికి అయినే డైరెక్టు చేస్తున్నారు."

"అట్లాగా! అయితే మరింత సేపూ చెప్పవేం? మాకు బాగా దగ్గరవాడివే నన్నమాట" ప్రకాశం వేపు విశ్మయంగా చూస్తూ అన్నారు శాస్త్రిగారు.

"ఒసేవ్ సుశీ! ఈ ప్రకాశం ఎవరో కాదేవ్, మనకు బాగా దగ్గరవాడే, మన ఆనందరావుకి దూరపు బంధువుట" అంటూ ఆనందంగా అరిచారు శాస్త్రిగారు.

సుశీలమ్మ ప్రకాశంని నఖశిఖ పర్యంతం చూసింది, బుగ్గమీద వేలేసుకుని.

శాస్త్రిగారికి సినిమాలంటే, నటులంటే గొప్ప అభిమానం, అట్లాంటప్పుడు తారాపథంలో ముందు ముందు వెలుగొందబోయే నటుడు తమ యింటికి అనుకోని విధంగా వచ్చాడంటే అది ఎంత గర్వ కారణం శాస్త్రిగారి విషయంలో. అందుకే ఆయనకు ప్రకాశం అంటే సదభిప్రాయం కలిగింది. అట్లా కాబట్టే ఆయన అభిమానాన్ని చూరగొన గలిగాడు ప్రకాశం.

చాలాసేపు మాట్లాడుకున్న తరువాత పడుకోడానికి లేచారు కాని పక్కలు కుదరలేదు.

"గెస్టులు యెవరేనా వస్తే కాస్త యిబ్బందినోయ్ మాయింటిలో" అన్నాడు శాస్త్రిగారు చిన్నగా దరహాసంచేస్తూ.

"పరవాలేదండి! నేను హాల్లో పడుకుంటాలెండి" అన్నాడు ప్రకాశం వెంటనే.

"నీ గురించికాదోయ్! నేచెప్పేది, వూరికే అంటున్నాను, గెస్టు రూం కట్టించాలనే వుద్దేశ్యంలోనే వున్నాం, అయిన నాకేం యిబ్బంది! మా అమ్మాయి యెట్లాగూ లేదు, ఆ గది ఖాళీయే, అందులో పడుకుందువుగానిలే, మా అమ్మాయినిగూర్చి నీకు చెప్పనేలేదు కదూ? అదిగో ఆ ఫోటోలో వుంది చూడు! పేరు రాధ, వాళ్ళ మామయ్యగారింటికి వెళ్ళింది" శాస్త్రిగారు చెప్పుకుపోతున్నారు, ప్రకాశం అన్నింటికి 'ఊ' కొడుతున్నాడు.

తనకని యేర్పాటు చేసిన గదిలోకి వెళ్ళి పడుకోవటానికి వుపక్రమించాడు ప్రకాశం.

"నీ కేమయిన కావలిస్తే నిస్సంకోచంగా అడుగు బాబు!" అంది సుశీలమ్మ, 'అలాగే' అన్నట్లు చూసాడు ప్రకాశం.

"వస్తానోయ్ నిద్రవస్తోంది..." ఆవులిస్తూ అన్నారు శాస్త్రిగారు.

"అట్లాగే సార్! నేను వుదయం ఆరు గంటల ట్రైనుకి వెళ్ళిపోతాను" ప్రకాశం అన్నాడు.

"వెళ్దువుగాని లేవోయ్...!"

"లేదుసార్ వెళ్ళాలి"

"అయితే వెళ్ళేముందు నన్ను లేపు..."

"ఎందుకు? మీకు శ్రమ! ఇప్పటికే మీకు చాలా శ్రమ యిచ్చాను"

"అట్లాగే, విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్..."

"థేంక్యూ సార్..."

"గుడ్ నైట్!"

"గుడ్ నైట్!"

శాస్త్రిగారు వెళ్ళిపోయారు గదినుంచి.

* * *

ఆరోజు యథావిధంగానే బాలబాడును, బ్రధకంగా వొళ్ళువిరిచి వూరిమీద పడ్డాడు, తన కార్యక్రమాన్ని నిర్వర్తించేందుకు.

"పేపరు సార్!" అన్న కేక విని బయటకు వచ్చారు శాస్త్రిగారు, పేపరు తీసుకుని హాల్లో వాలు కుర్చీలో కూర్చుని పేపరు చూడటం మొదలెట్టారు.

"ఏమండీ! తీర్గ్గా పేపరు చదువుతున్నారా కూర్చుని" అంది సుశీలమ్మ కాఫీ కప్పు అందిస్తూ.

"ఏం చెయ్యమంటావ్?"

"అమ్మాయి యీరోజు వస్తానని రాసింది కదా! స్టేషనుకి వెళ్ళకూడదుటండి"

"ఏ బండి కొస్తుందో యెవరికి తెలుసు!? క్రొత్తేం కాదుగా, రిక్షాలో వచ్చేస్తుందిలే, యే బండిలో వస్తోందో తెలియకుండా స్టేషనులో తిష్ఠ వేసుక్కూర్చో మంటా వేమిటి?"

"వద్దులెండి! ఇంట్లో తిష్ఠ వేసుక్కూర్చున్నారుగా" విసురుగా లోపలకు వెళ్ళిపోయింది సుశీలమ్మ.

శాస్త్రిగారు మళ్ళీ పేపరు చూడటంలో లీన మయ్యారు, చప్పున ఆయన దృష్టి రెండో పేజీలో వున్న ఫోటో మీదపడింది. ఆ ఫోటో క్రింద వ్రాయబడ్డ సారాంశాన్ని చదివి అధిరిపడ్డారు.

"ఎంత మోసం! ఒసేవ్ ఇట్లారావే..." గట్టిగా కూతవేసారు.

"ఏమిటండీ! ఏమయ్యింది" సుశీలమ్మ వచ్చిం దక్కడకు కంగారుగా."

"చూడవే యెంత మోసమో? మున్న మనింటికి వచ్చాడే! వాడే ఆ ప్రకాశం, సినిమా నటుణ్ణని యెంతగా నమ్మించాడు దొంగ వెధవ! వాడు నిజంగా సినిమా నటుడు కాదట, అదనీ ఇదనీ రక రకాలుగా చెప్పుతుని ప్రజలమీదపడి దోచుకుంటున్న దొంగ వెధవట, బ్రతుకు తెరువుకోసం ఇదొహాచే ' దొరికిన ట్లుందా దొంగ వెధవకి" అంటూ పేపరు చూపించారు శాస్త్రిగారు.

"ఏమిటీ...? నేననుకుంటూనే వున్నాను! వాడు దొంగ వెధవని, మీరు వాణ్ణి నెత్తికెక్కించుకుని సినిమా నటుడని చెప్పుతున్నారాయె యెంత మోసం! మీకెప్పుడూ ఇట్లాంటివాళ్ళే తారసపడతారు..."

"దొంగ వెధవ! ఆరోజు కాలేజిలో అందరూ నమ్మే ట్లు వుపన్యాసం యిస్తే, నిజమేనని నమ్మాను!..."

"అది సరే! ఆ రోజు తిన్నగా తీసుకెళ్ళి అమ్మాయి గదిలో పడుకో బెట్టారా దొం వెధవని, మనవికూడా ఏమయినా అపహరించాడేమో చూడండి..."

"అవునవును ఆ గదిలోనే బీరువా వుంది"

శాస్త్రిగారు వణుకుతున్న కాళ్ళను అదుపులో పెట్టుకుని, రాధ గదిలోకి వెళ్ళి బీరువావేపు చూసారు దాన్ని చూస్తే అనుమానస్పదంగా ఏమీ కనబడలేదు కాస్తగుండె ధైర్యం చిక్కబట్టుకుని బీరువా తెర చూస్తారు. రాధ పెళ్ళికని అయిదు వేలు అప్పు చే ఆ బీరువాలోనే వుంచారు.

డబ్బు పెట్టిన చోట చూసారు శాస్త్రిగారు, అం గుండె ఆగిపోయినంత పనయ్యింది శాస్త్రిగారికి, డబ్బు లేదు, అదే చోట ఓ కాగితం వుంది, ఆత్రంగా దాన్ని చేతిలోకి తీసుకున్నారు శాస్త్రిగారు.

"సార్! మిమ్మల్ని యిలా మభ్య పెట్టినందుకు నన్ను మన్నించండి! నేను నటుడుని నేను చిన్న నాటకం ఆడితే మీరు నమ్మి నన్ను మీ యింటికి తీసు కెళ్ళారు, ఆ రాత్రి పడుకోవటానికి ఆశ్రయ మిచ్చి అవకాశం యిచ్చారు, అందుకు నేను చాలా కృతజ్ఞ తెలుపుకుంటున్నాను. డబ్బు పోయిందని మీ కంగారు పడకండి! ఆ డబ్బు నేనే పట్టుకె పోతున్నాను అని తెలపటం, నా నిజం మీకు కోప వస్తోంది కదూ? నన్నేం చేయలేరుగా—"

వెడతా! "ప్రకాశం."

(సమాప్తం)

